# మన రాజులు

—"సూర్యం"

"మనుష్యుడికి మృగానికి భేదయేమిటి?" అన్నాడు ఒకడు!

"సృష్టిలో అంతా ఒకటే! అన్నాడు తడుముకోకుండా ఇంకొకడు.

అంతా ఒకటే! సృష్టిలో! చిలక పలుకులు! ఎంత వరకు ఆ సిద్ధాంతాన్ని – అమలులోకి, ఆ ఆశయాన్ని ఆచరణంలోనికి పెట్టుతున్నారో! అనిగొణుకుతూ..... ఈ వేదాంత తాత్వికులకు సృష్టిలోని తారతమ్యాలు – ప్రకృతి పరిణామాలు – మనుష్య జాతి భేదాలు–భావాలు తెలియవంటూ వదురుకుంటూ వెళ్లిపోయాడు.

అది కాళ్ళీడ్చుకుంటూ మూలుగుతూ దారిని పోతూ వింటూన్న ఒకాయన:

"అందులోనే భేదముందంటూ" అన్నాడు ఠంగున దెబ్బకొట్టినట్టు.

అవునవునూ అక్కడే వ్యత్యాసముందంటూ సమర్థించాడు మొదటాయన.

అయన్ని అహ్వానిస్తూన్నట్టుంది ఆ మాటల సమర్థింపు. వెళ్లిపోతూన్న మనిషి వెనక్కి తిరిగి చూశాడు:

ఇద్దరు కూర్చున్నారు.

నోటెంట ఫ్యాక్టరీ పొగగొట్టం లా పొగ వస్తూంది.

"రండి వచ్చి కూర్చోండి" అన్నాడు నోటిలోని చుట్ట తీయకుండా నే.

చిరునవ్వుతో వచ్చి కూర్చున్నాడు.

చుట్ట కావాలా అని అడిగాడు మొదటాయన.

నేను తాగనండి థాంక్సు – క్షమించాలి అన్నాడు అందరూ అన్నట్టు మామూలు ధోరణిలో.

అచ్చే ఒక దమ్ము కొట్టి చూడండి అన్నాడు రసికుడు లాగ.

"ఈ చుట్ట ఎవరి సృష్టి' అన్నాడు.

మనసృష్టే కాబట్టి మనం కాల్చి పారేస్తున్నాము.

మనం దేవునిసృష్టి కాబట్టి – దేవుడు మనల్ని చంపి పారేస్తున్నాడు.

"మీరు కల్పించుకున్న సృష్టిలో దేవుడూ (సృష్టికర్త) చంపుతాడు, మృగాలు చంపుతాయి, రాజులు చంపుతారు (ప్రాణుల్ని).

మీరన్న చివర ముక్కలో రాజంటే? ఎవడు? (ఒక ప్రత్యేకత రాజుకు కూరుస్తున్నారే!)

"సింహాసనాసీనుడు రాజు".

అంటే,—

సింహాసనాన్ని కంటక ప్రాయమైన ముళ్ల కిరీటాన్ని నెత్తిని పెట్టుకొని అధిష్టించినవాడు.

అయితే కిరీటాన్ని తగిలించుకొని సింహాసనం ఎక్కినవాడెల్లా—ఎక్కినకాని, రాజుకాడా ఏమి?

ఓహో ఎందుకుకాడు. ఎంతమంది లేరు రాజులు భారతదేశంలో.

"అవు నవును వున్నారు తరాజులు –ఇస్పేటు రాజులు – రాజ్యాలులేని రాజులు, మంత్రి రాజులు, నాటకాల్లో, సినిమాల్లోని రాజులు – అజ్ఞాతవాసరాజులు.

'అసలు భారతదేశమే ఒక రాజుకలది.

"కలదు కదా ఆంధ్రదేశంకూడా?'

"కాని రాజైనవాడు సింహాసనాన్ని అధిష్టించినా రాజే. లేకున్నా రాజే!

పేరున్నవాడు కూడానా.

ఆఁ! అల్లూరి సీతారామరాజుకూడా!

అయితే రాజ్యం పూర్తిగా నాశనమైనా కూడానా?

ఆ రాజ్యం పోయినా లక్షణాలు పోవు కాబట్టి.

రాజపట్టం పతనం కాదు,

"సింహాసనంలో కూర్చున్నంత మాత్రాన రాజు కాలేడు".

మరి రాజెవ్వడో చెప్పవూ?

నా విష్ణుః పృథివీపతి".

అంటే—

"రాజు దైవాంశ సంభూతుడని

అయితే "రాజూమనుష్యుడే!" అంటారే!

"మానవమాత్రుడే కాని, దేవుడుతో సమానం!

దేవుడు అంటే—

దేవాలయం కలవాడు.

అయితే దేవాలయాన్ని కలవాడే దేవుడా?

అరే! నాస్తికత్వం నీ ముఖాన్ని తాల్చినట్టుగా వుందే.

"అవును. లేని దేవుణ్ణి సృష్టించి ఆ దేవుడే లేదన్న వాడిని నాస్తికుడని ఈ ఆస్తికులు నేర్చుకొన్న తెలివి తేటలు.

వాళ్ల వాళ్ల వెఱ్ఱి వదలుకోరు కదా!

చాదస్తంగా వుందే! సంభావణ!!

★

రాజులకు రాక్షసులకు భేదమేమిటి?

"రాజులు ప్రత్యక్ష మృత్యు దేవతలు, నరహంతకులు - జీవ ఘాతకులు".

"రాక్షసులు పురాణాల్లో చెపుతూన్నట్టు మనుష్యుల్ని చంపి వాళ్ళ రక్త మాంసాన్ని తినేవాళ్లు!'

— నిజమే! రాక్షసులవలె మనుష్యుల్ని సోదర మానవుల రక్తాన్ని త్రాగుతున్నారు.

ఆడ మగ వృద్ధ శిశువు భేదంకూడా లేదు.

★

"రాజులు రాక్షసులు కాదు. రాక్షసులు మాంసాన్ని తింటారు. రక్తాన్ని జుర్రుతారు. అందులో మనుష్య రక్తమంటే మరింత మక్కువ".

అయితే రాజులు నేడు మనుష్య రాక్షసులు కావాలి. కాని రాజులు అలా చేయడం లేదే!

లేదా? ప్రజలను చంపి వారి మాంసం తినడంలేదా? కళ్లు పోయాయా?

"వాళ్ల మాంసం తింటున్నారా?"

"వాళ్ల రక్త మాంసమే వాళ్ల ధనం, వాళ్ళ మతం. అవి రెండూ రాజులు ఆరగిస్తున్నారు కాబట్టి వాళ్లు మాంసం తిన్నట్టే.

"అయితే, రాజులకు చెప్పి నిన్ను ఆహారంగా చేయిస్తాను!

"సంతోషం: అంత మాత్రానికే భయపడను."

"పిశాచానికి కూడానా?"

మనుష్యుల ప్రాణం తీసే నరరాజపిశాచానికి కూడా! అయితే ఒక విశేషం.

"రాజు పిశాచంవలె ప్రాణాల్ని తీస్తాడుగాని, తిరిగి ప్రాణాల్ని పోసే శక్తి వుందా?"

"ఆ నాకు తెలియదు!"

అయితే మనుష్యరాక్షసులికి సహజ జ్ఞానం వుంటుందా?"

ఉంటుంది కొంచెం. కాని ఆ కించత్ జ్ఞానానికి వాళ్లు మిట్టిపడి గర్వపడతారు. సర్వజ్ఞలంటూ విర్రవీగుతారు.

'బాబో ఇక్కడెవ్వరూ పిశాచబంధువులు రాజపీనుగలు లేరు కదా?"


"అంత భయమా ప్రాణమంటే!"

"ప్రాణమే కాబట్టి."

★

మరి మనుష్యుడు! మిథ్యావాదికాదు కాబట్టి "అశాశ్వితమైన శరీరాన్ని చంపించడంలోను బాధ పెట్టడంలో మొనగాడు రాజు."

ఏమి అలా దేబెమొగంతో చూచుచున్నావు? అర్థం కాలా?



కాదు "పిశాచా లున్నవంటావా?"

"లేకేమి".

"నీ బుర్రలో వున్నాయా?"

"కాదు మన పురాణ కథలనిండా."

"మా నాయనమ్మ నోట్లో కూడా?

★

"రాజు రాక్షసుడే; మనుష్యుల్ని చంపించడమన్నా చంపడమన్నా ఒకటే!"

"మరి ఈ రాజదౌష్ట్యానికి అంతు లేదా?"

"అదిగో ప్రజలకి ఒళ్లు మండిపోతోంది. అజేయం అప్రమాతమైన ప్రజాశక్తి రాజుకు తెలియదు. వాడు పిశాచమయాడు కాబట్టి. ప్రజాశక్తిముందు రాజ్యాలే తలక్రిందు లవుతాయి. వృధాగా స్వార్థాభిలాషిగా ప్రజల్ని పీల్చి పిప్పి చెయ్యడంలోని వెర్రితనం అర్థం కాదు!"

"సర్వ నాశన మయేవరకు వదలిపెట్టడు రాజు."

"మరి తిన్న మాంసమంతా జీర్ణించి హరించిపోవలె కదా".

"అంతలో పక్కున నవ్వాను."

"నీ నవ్వు నీ ప్రాణాలమీదికి వస్తుంది జాగ్రత' అని హెచ్చరిక".

"ఇంతకుముందు ఎన్నో జాగ్రత లయాయి."

"నీదంతా పిశాచపు నీతిగా వుంది."

"అవును నీతిలేనివానికి పైశాచికమే నీతి' ఆ నీతే దేవుడు!' 'మొండివాడే రాజు.'

'ఇంక ఆపు నీ వ్యర్థ ప్రలాపం' అదిగోచూడు అన్నిటికి అంతున్నట్లు కత్తితో నరుకబడినట్లు రక్త సిక్త శిరస్సుతో సూర్యుడు సముద్రములో కలుస్తున్నాడు. పక్షులు నివాసాలు వెతుక్కుంటున్నాయి. మనం యిల్లు చేరుదాం!

అదేమిటో? నా కా భాష అర్థం కావడంలేదు.

'అవును అది పిశాచభాష నీ కర్థంకాదు.' నీవు సాధారణ మనుష్యుడవు.

'ఆ కవిత్వం – ఆ పదజాలాలు కూడా నీ బుర్రకెక్కవు.'

'బుర్ర ప్రయోగించినా కూడానా?' అన్నాడు వచ్చే నవ్వును ఆపుకోలేక.

'తలకు తలంపు ఏమీ తట్టలేదు!'

'బుద్ధి బలం వుపయోగించు బాగా'.

'పశుబలం ప్రయోగిస్తున్నాడు రాజు'.

అవును 'పిరికితనంచేత' మనసులో తెగులుపోయి తిక్క తెలిసింది.

అవును! స్పష్టంగా!

'అవును!' నిజంగా (భీకరధ్వనిలో).

అయితే ఒకటి మరిచాను:

ఏమిటది?

అది అన్నిటిని మించింది: రాజు దగ్గరనుండే దివాన్లు 'దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వడన్నట్లు ప్రజల సహజ స్వాతంత్ర్య హక్కుల్ని అరికట్టాలని చూస్తారు అందులో అఖిలభారత దివాన్ల రాష్ట్రపతి సంస్థానాల్లో ద్ధారకుడు సర్ సి. పి. సచివోత్తం అగ్రేసరుడు.

మరి యితర సంస్థానాధిపతుల దివాన్లు? వాళ్ళు కూడా నరేంద్రులకంటె మించినవాళ్లే.

రాజుల దగ్గరనుండే యీ దివాన్లు రాజుల్ని మించి 'యథారాజా తథాప్రజా' అనేది మరచిపోయి అధికార మదాంధకారంచేత మత్తెక్కి వుంటారు.

అవును వాళ్ళ నాశనానికే దిక్కులేని దివాన్లు అవడానికే అంటూ ఎవరో చదువుతూన్నట్లు వినిపించింది.

★ కథాంజలి ★

(చక్కనికథల మాసపత్రిక)

రమ్యమైన కథలకు
రాజకీయ కథలకు

కథాంజలికే అగ్రతాంబూలం.

అన్ని హిగిన్ బాతమ్స్ రైల్వే బుక్‌స్టాల్సులోను దొరకును.

సంవత్సర చందా రూపాయి.

విడిప్రతి అణా.

వివరాలకు: కథాంజలి

జి. టి. మదరాసు.